క్లుప్తంగా

'చట్టాలపై అవగాహన అవసరం'



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రమేష్‌బాబు

టెక్కలి రూరల్: విద్యార్థినులకు చట్టాలపై అవగాహన అవసరమని ఎస్‌ఐ-2 రమేష్‌బాబు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో పలు చట్టాలపై బుధవారం అవగాహన కల్పించారు. ప్రస్తుత సమాజంలో మహిళలకు భద్రత కల్పించడానికి ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలను ఏర్పాటు చేశాయన్నారు. దీనిలో భాగంగా దిశా చట్టం ఉపయోగాన్ని వివరించారు. అలాగే మత్తు మందుల వినియోగం వలన కలిగే నష్టాలను తెలియజేశారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లు గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నర్తుకు ఎమ్మెల్సీపై హర్షం

కోటబొమ్మాళి: ఇచ్ఛాపురం నియోజకవర్గానికి చెందిన నర్తు రామారావును వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించడంపై కోటబొమ్మాళి మండలానికి చెందిన యాదవ సామాజిక వర్గం నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కిష్టుపురం, సరియాపల్లి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు బొడ్డు వెంకటరమణ, పిట్ట శ్రీనివాసరావు, బొడ్డు చెంచు, బొడ్డు అప్పన్నలు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న స్ఫూర్తి పోలీసు కళా బృందం

టెక్కలి: మహిళలు, చిన్నారులపై జరుగుతున్న లైంగిక వేధింపులపై అప్రమత్తంగా ఉండాలని స్ఫూర్తి పోలీసు కళా బృందం సభ్యులు సూచించారు. ఈ మేరకు స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ఏపీ ఎంజేపీ పాఠశాలల్లో బుధవారం అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఎదుటి వ్యక్తుల ఆలోచనలు, ప్రవర్తనపై చాకచక్యంగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎస్‌ఐలు రామకృష్ణ, రమేష్‌లు సూచించారు.

విద్యార్థులకు సహకారం అభినందనీయం



విద్యార్థులకు ఫైల్స్ పంపిణీ చేస్తున్న దృశ్యం

సోంపేట: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు దాతలు సహకారం అందించడం అభినందనీయమని మామిడిపల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రోణంకి అనంతరావు అన్నారు. నందిగాం మండలానికి చెందిన ప్రజ్ఞా హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు భద్రపరుచుకునే ఫైల్స్‌ను బుధవారం అందజేశారు. ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పలాస: రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించడమే కాకుండా, వారిని ఆ దిశగా ప్రోత్సహించాలని ఎంపీపీ ఉంగ ప్రవీణ సూచించారు. మండలంలోని టెక్కలిపట్నంలో నవధాన్యాల సాగుపై రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ కార్యకర్త సీహెచ్ నాగరాజు మాట్లాడుతూ రైతులు తమ పొలాల్లో ఏడాది పొడవునా పంటలు పండించేందుకు సూచనలిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి ఉంగ సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చీడపీడల నివారణతో దిగుబడులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కంచిలి: కొబ్బరి, జీడి, మామిడి తోటల్లో చీడపీడల నివారణతో అధిక దిగుబడులు సాధించవచ్చని కవిటి ఉద్యానశాఖాధికారి మాదవీలత అన్నారు. మండలంలోని శమళ్లపుట్టుగలో తోటబడి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొబ్బరి తోటల్లో ఎర్రముక్కు పురుగు, నల్లముక్కు పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. జీడిమామిడి తోటల్లో చిగురు దశ, పూత దశ, పిందె దశల్లో చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గృహ సారథులే గ్రామాభివృద్ధికి వారధులు

● ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

కోటబొమ్మాళి: గృహ సారథులు, సచివాలయాల కన్వీనర్లే గ్రామాభివృద్ధికి వారధులని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని చీపుర్లపాడు, కొత్తపేట-2 సచివాలయాల పరిధిలోని గృహ సారథులు, కన్వీనర్లతో సమీక్ష సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ప్రజలతో మమేకమై సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దుక్క రోజారాణి, పీఏసీఎస్ అధ్యక్షుడు బాడాన మురళీధర్, సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌చార్జి గెడ్డవలస నాగభూషణరావు, ఎంపీటీసీ బొడ్డు అప్పన్న, సర్పంచ్‌లు నూక సత్యరాజ్, నేతింటి అప్పలస్వామి, సుంకరి జనార్ధన, బలగ సూర్యారావు, బొడ్డు వెంకటరమణ, రాంపాత్రుని సావిత్రి, వైస్ సర్పంచ్ చుక్క దివ్య, వార్డు సభ్యులు తర్ర శిమ్మయ్య, బైరిరాజు, రావాడ స్వాతి, మెండ తవిటయ్య, మొజ్జాడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

కోటబొమ్మాళి: మండలంలోని హరిశ్చంద్రపురం సర్పంచ్ గురువెల్లి కేశవరావు తల్లి నర్సమ్మ ఇటీవల మరణించారు. దీంతో వారి కుటుంబాన్ని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ బుధవారం పరామర్శించారు. ఆయనతో పాటు సర్పంచ్ నూక సత్యరాజ్, ఎంపీటీసీలు బగాది దివాకర్, సత్యం, వాసుదేవరావు, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ దుంగ శిమ్మన్న, పీఏసీఎస్ అధ్యక్షుడు బాడాన మురళి తదితరులు ఉన్నారు.



సర్పంచ్ కేశవరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ

ఘనంగా మంత్రి అప్పలరాజు జన్మదిన వేడుకలు



మంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న మెప్మా ఆర్పీలు

కాశీబుగ్గ: మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. పలాసలోని మంత్రి క్యాంప్ కార్యాలయం ఆవరణలో మంత్రి సతీమణి శ్రీదేవి, కుమారులు అర్నవ్ వర్మ, ఆర్నవ్ వర్మలతో కలిసి కేక్ కట్ చేశారు. పలాస నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో వచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఇచ్ఛాపురం రూరల్: మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును ఇచ్ఛాపురం ఎంపీపీ బోర పుష్పతో పాటు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ ఇన్‌చార్జి ఆశి పురుషోత్తమరెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ఆశి కృష్ణారెడ్డి, పిట్టల మామయ్యరెడ్డి, చినపాన భోగయ్య తదితరులు పాల్గొన్నారు.

దాతలకు పన్ను మినహాయింపు

కంచిలి: మండలంలోని మండపల్లిలో ఉన్న సీతయ్య ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థను ఆదాయపు పన్ను శాఖ కార్యాలయం వారు గుర్తింపునిచ్చి, దాతలు సమర్పించే విరాళాలకు ఆదాయపు పన్ను రాయితీ మినహాయింపు వెసులుబాటును ప్రత్యేక నమోదు సంఖ్య ద్వారా కల్పించినట్లు ఫౌండేషన్ నిర్వాహకులు గుళ్ళ రమేష్, మోహనరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదాయపు పన్ను రాయితీ పొంది సంస్థ సేవల్లో దాతలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఉచితంగా కంటి ఆపరేషన్లు

ఇచ్ఛాపురం: ఆరోగ్యవరం సోంపేట కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో హెల్ప్‌ఏజ్ ఇండియా సౌజన్యం సభ్యులు 10 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించారు. ఇటీవల 60 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించారు. వీరిలో అవసరమైనవారికి కంటి ఆపరేషన్లు చేయించి బుధవారం ఇళ్లకు చేర్చారు. దీంతో వీరికి పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

యాదవులకు సముచిత స్థానం



మాట్లాడుతున్న వెంకటరావు

మందస: రాజకీయంగా వెనుకబాటుకు గురైన యాదవులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సముచిత స్థానం కల్పించారని యాదవ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి, మూలిపాడు సర్పంచ్ గుసిరి వెంకటరావు అన్నారు. గ్రామంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. శ్రీకాకుళం జిల్లాలో సుమారు రెండు లక్షలకు పైబడి యాదవ ఓటర్లు ఉన్నా, ఏ ప్రభుత్వం కూడా యాదవులను గుర్తించలేదన్నారు. తెలుగుదేశం పార్టీ హయాంలో యాదవులను గుర్తించకపోగా.. కొంతమంది నాయకులను అణగదొక్కారని విమర్శించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా నర్తు రామారావును ఎంపిక చేయడం అభినందనీయమన్నారు. ఎట్టకేలకు యాదవుల సేవలను గుర్తించి, చట్టసభకు ఒక నాయకుడిని పంపించడం హర్షణీయమని పేర్కొన్నారు. యాదవ సామాజిక వర్గం తరుపున సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని, యాదవులంతా ఐక్యంగా పార్టీ పటిష్టతకు కృషి చేస్తామని వెల్లడించారు. ఆయనతో పాటు కార్యవర్గ సభ్యుడు సార దూర్వాసులు ఉన్నారు.

బాధితులకు చేయూత



నిత్యావసర సరుకులు అందజేస్తున్న సంస్థ సభ్యులు

కవిటి: మండలంలోని తొత్తిడిపుట్టుగలో ఇటీవల సంభవించిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన కుటుంబాలకు హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ చేయూతనందించింది. ఈ మేరకు బుధవారం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాలకు నెల రోజులకు కావాల్సిన రేషన్ సరుకులు, దుస్తులు అందజేశారు. సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

మహనీయుల అడుగు జాడల్లో నడవాలి



మౌలానా అబుల్‌కలాం అజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: విద్యార్థులు మహనీయుల అడుగుజాడల్లో నడవాలని హెచ్‌ఎం కొత్తపల్లి సుహాష్‌చంద్ అన్నారు. బుధవారం మౌలానా అబుల్‌కలాం అజాద్, స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి సందర్భంగా ముచ్చింద్ర పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లేశ్వరరావు, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

నర్తు నామినేషన్‌కు తరలిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు



నామినేషన్ ప్రక్రియకు బయలుదేరిన పార్టీ శ్రేణులు

శ్రీకాకుళం పాత బస్టాండ్: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి నర్తు రామారావు నామినేషన్ వేసే ప్రక్రియ బుధవారం ఉత్సాహంగా జరిగింది. పార్టీ శ్రేణులతో కలిసి వెళ్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేయగా.. జిల్లా వ్యాప్తంగా నాయకులు తరలి వచ్చారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఇచ్ఛాపురం నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త సాయిరాజ్, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, ఇచ్ఛాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. వీరంతా జిల్లా కేంద్రంలో పార్టీ కార్యాలయం నుంచి బయలుదేరి కలెక్టరేట్‌కు వెళ్లారు.

ఘనంగా కవలల దినోత్సవం



కవల పిల్లల దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కవిటి: మండల కేంద్రం కవిటిలోని కల్యాణి విద్యా సంస్థల్లో కవల పిల్లల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా కవల పిల్లలైన విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచినవారికి ప్రిన్సిపాల్ బిందు మాధవి బహుమతులు అందించారు.

ఆర్థికాభివృద్ధి సాధించాలి



మాట్లాడుతున్న ఏపీఎం ప్రసాదరావు

ఇచ్ఛాపురం రూరల్: స్వయం శక్తి సంఘాలు బ్యాంకులో దాచుకుంటున్న పొదుపు నిధులతో ఆర్థికాభివృద్ధి సాధించాలని ఏపీఎం సనపల ప్రసాదరావు సూచించారు. మండలంలోని కేశుపురం గ్రామంలో మహిళా సంఘాలతో సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ప్రతీ సంఘంలో ఉన్నటువంటి మహిళలు వారి కుటుంబ సభ్యులు ఇన్సూరెన్స్ చేసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. సంఘంలోని తొమ్మిది మంది సభ్యులు తమ వ్యాపారాభివృద్ధికి సుమారు రూ.4.50 లక్షలు రుణంగా తీసుకునే వెసులుబాటు కల్పించడం జరిగిందన్నారు.

విజ్ఞాన సందర్శనకు ఉద్యాన రైతులు



సందర్శనకు వెళ్తున్న రైతులు

వజ్రపుకొత్తూరు: హ్యూమన్ డవలప్‌మెంట్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వెజిటబుల్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ సౌజన్యంతో ఉద్యాన రైతులు విజ్ఞాన సందర్శనకు బుధవారం బయల్దేరారు. సంస్థ డైరెక్టర్ పీవీ రమణ ఆధ్వర్యంలో రైతులకు ఉద్యాన పంటలు, తోట పంటలు, పాడి పెంపకంపై అవగాహన కల్పించారు. శాస్త్రీయ విజ్ఞానం ద్వారా రైతులకు సాగు మెలకువలు తెలియజేయనున్నట్లు పేర్కొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి చర్యలు



సూచనలిస్తున్న పీడీ అనంతలక్ష్మి

సారవకోట: అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నట్లు మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ అనంత లక్ష్మి తెలిపారు. మండల కేంద్రంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను పటిష్టంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీని కోసం సూపర్‌వైజర్లు ఎప్పటికప్పుడు కేంద్రాలను పర్యవేక్షించి, లోటుపాట్లును గుర్తించి వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. వైద్యశాఖతో కలిసి గర్భిణులు, బాలింతలు వైఎస్సార్ కిట్లు సరిగా వినియోగించేలా, పౌష్టికాహారం తీసుకునేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రాజెక్టు పరిధిలో జరుగుతున్న నాడు-నేడు పనుల తీరును అడిగి తెలుసుకున్నారు. వడ్డినవలస అంగన్‌వాడీ కేంద్రాన్ని పర్యవేక్షించి రికార్డులు పరిశీలించారు. సీడీపీఓ హెచ్.కె.కామాక్షి, తులసీలక్ష్మి పాల్గొన్నారు.

టెక్కలి డివిజన్‌లో 10,546 మంది ఓటర్లు

టెక్కలి: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఇటీవల చేపట్టిన పట్టభద్రుల ఓటర్ల నమోదు కార్యక్రమంలో భాగంగా టెక్కలి డివిజన్‌లో 10,546 మంది పట్టభద్రులు తమ ఓటుహక్కును నమోదు చేసుకున్నారు. ఇందులో 7,486 మంది పురుషులు ఉండగా, 3,060 మంది మహిళలు ఉన్నారు. టెక్కలి మండలంలో అత్యధికంగా 2,260 మంది ఓటుహక్కు కలిగిన పట్టభద్రులు ఉన్నారు. ఇటీవల విడుదల చేసిన ఓటర్ల జాబితాలో పేర్లు లేని అభ్యర్థులు మరోసారి ఈనెల 23 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. వీటితో పాటు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి టెక్కలి డివిజన్‌లో జెడ్పీటీసీ, ఎంపీటీసీలు కలిపి మొత్తం 161 మంది ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. మొత్తం 9 మండలాల పరిధిలో మహిళలు, పురుషుల వారీగా పట్టభద్రుల వివరాలను పరిశీలిస్తే...

మండలం	పురుషులు	మహిళలు
టెక్కలి	1602	658
పాతపట్నం	1162	515
కోటబొమ్మాళి	1202	439
కొత్తూరు	937	291
మెళియాపుట్టి	640	212
హిరమండలం	534	226
ఎల్.ఎన్.పేట	365	132
సారవకోట	802	301
సంతబొమ్మాళి	776	286

'సీపీఎస్ రద్దు చేయాలి'



సోంపేట: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

టెక్కలి రూరల్: సీపీఎస్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలని కోరుతూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా చేపట్టారు. సంఘ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేపట్టిన ఈ ధర్నాలో జిల్లా ఉపాధ్యక్షుడు బొడ్డేపల్లి నేతాజీ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఏలు అందించాలని కోరారు. అలాగే ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పూర్వ కార్యదర్శి ఎస్.వి.అనిల్‌కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ శ్రీనివాసరావు, నందిగాం, సంతబొమ్మాళి మండల కార్యదర్శులు పాల్గొన్నారు.

సోంపేట: రాష్ట్రంలో ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ సంఘ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ ఎస్వీ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా కార్యదర్శి ఎస్.చాణక్య, ఉపాధ్యక్షుడు జి.భీమారావు, సంఘ ప్రతినిధులు ఎస్.డిల్లీ, చంద్రశేఖర్, డి.గోవిందరావు, జి.తిరుపతిరావు, ఆర్.కామరాజు తదితరులు పాల్గొన్నారు.

సారా అమ్మిన వ్యక్తికి జరిమానా



విచారణ నిర్వహిస్తున్న దృశ్యం

కవిటి: మండల మేజిస్ట్రేట్ కోర్టు(తహసీల్దార్ కార్యాలయం)లో అక్రమ మద్యం అమ్మకాలపై మేజిస్ట్రేట్ రాచర్ల అప్పలరాజు నేతృత్వంలో బుధవారం విచారణ నిర్వహించారు. మండలంలోని ఇద్దివానిపాలెంకు చెందిన బైపల్లి ధనరాజు గతేడాది సెప్టెంబర్ 4వ తేదీన 160 సారా ప్యాకెట్లతో పట్టుబడ్డాడు. అనంతరం అతనిపై బైండోవర్ కేసు విధించారు. ఈ నేపథ్యంలో మళ్లీ 2022 డిసెంబర్ 27న 200 ప్యాకెట్లతో పట్టుబడి పలాస కోర్టులో 14 రోజుల రిమాండ్‌కు గురయ్యాడు. అనంతరం బెయిల్‌పై విడుదలయ్యాడు. దీనికి సంబంధించి గతంలో నమోదైన బైండోవర్ కేసుకు లోబడి, అక్రమ మద్యం అమ్మకం నేరానికి పాల్పడిన బైపల్లి ధనరాజుకు రూ.30,000 జరిమానా విధిస్తూ కవిటి మండల మేజిస్ట్రేట్ కోర్టులో తీర్పువెలువరించినట్లు ఇచ్ఛాపురం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్‌ఐ ఎస్.గురుమూర్తి తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



డీఈఓ నుంచి బహుమతి అందుకుంటున్న రోహిత్

సోంపేట: స్థానిక ఆదర్శ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న జె.పి.రోహిత్ జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్ పోటీల్లో ప్రథమస్థానం సాధించి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ చిన్నాజీ వర్మ తెలిపారు. శ్రీకాకుళంలో బుధవారం జరిగిన జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్ పోటీల్లో రోహిత్ ప్రథమ స్థానం సాధించాడు. దీంతో విద్యార్థికి శిక్షణ ఇచ్చిన సైన్స్ ఉపాధ్యాయులు పి.వి.ఆర్.హరిత, తిరుమల్ల దీప్తి, జయశ్రీలను సిబ్బంది అభినందించారు.

నవధాన్యాల సాగుతో భూసారం



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కాశీబుగ్గ: నవధాన్యాల సాగుతో భూసారం పెరుగుతుందని పలాస డివిజన్ ప్రకృతి వ్యవసాయం రీజనల్ టెక్నికల్ ఆఫీసర్ హేమసుందర్ తెలిపారు. పలాస ఏఎంసీ కార్యాలయం వద్ద రైతులకు నవధాన్యాల సాగుపై బుధవారం అవగాహన కల్పించారు. రైతులు సేంద్రియ విధానాన్ని అవలంభించడం వలన పంటలో, భూమిలోనూ మిత్ర పురుగులు అభివృద్ధి చెంది దిగుబడులను పెంపొందిస్తాయని సూచించారు. ఖరీఫ్‌లో వరిపంట వేసే ముందు నవధాన్యాలుగా పిలవబడే 30 రకాల విత్తనాలను ఎకరానికి 13 కిలోలు చొప్పున చల్లి, 45 రోజుల తర్వాత వచ్చే పంటను పశువుల మేతగాను, అలాగే మిగిలిన పంటను నేలలో కలియ దున్నాలని సూచించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ మాధవి, సత్యనారాయణ, ఎస్‌డీ ఎ.నాగరాజు, ధనంజయరావు, ఎంఏ లక్ష్మణరావు, మురళి, తారక్, విశ్వనాథం, పాపయ్య, కృపాసింగ్, లక్ష్మీకాంతం, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా బైజూస్ తరగతులు



ట్యాబ్‌లు పరిశీలిస్తున్న ఎంఈవో అప్పారావు

ఇచ్ఛాపురం: ఇటీవల ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపెట్టిన బైజూస్ తరగతులను పక్కాగా నిర్వహించాలని మండల విద్యాశాఖాధికారి కె.అప్పారావు సూచించారు. మండలంలోని పురుషోత్తపురం మున్సిపల్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి ట్యాబ్‌ల వినియోగం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు పాఠశాల హెచ్‌ఎం వై.లత, సీఆర్పీలు, పాఠశాల సిబ్బంది తదితరులు ఉన్నారు.

నేటి నుంచి క్షయ రోగులకు

ఆహార పదార్థాల పంపిణీ



వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న అనురాధ

నరసన్నపేట: ప్రధాన మంత్రి టీబీ ముక్తభారత్ కార్యక్రమంలో భాగంగా టీబీ రోగులకు ఉచిత ఆహార పదార్థాల పంపిణీని గురువారం నుంచి ప్రారంభించనున్నామని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ ఎస్.అనురాధ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా క్షయ రోగులకు విడతల వారిగా ఆహార పదార్థాలు అందించనున్నామని అన్నారు. మాకివలస పీహెచ్‌సీలో బుధవారం సమీక్ష చేపట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నరసన్నపేటలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి వచ్చే రోగులు క్షయ కార్డు తీసుకుని రావాలని సూచించారు. జిల్లా మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, వైద్యులు దుష్యంత్ కుమార్, సీతామహాలక్ష్మి, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ వాన సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.